

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకుడు వెలిశెట్టి సుధాకర్‌గుప్తా, రవియాదవ్

ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెలిశెట్టి సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజలో ముఠా జైసింహతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనను రెండో సారి గెలిపించిన ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ రామాలయం చైర్మన్ రవియాదవ్, శ్రీలక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, పద్మశాలి సంఘం రాంనగర్ శాఖ ఉపాధ్యక్షుడు వెంకటేష్, రాంనగర్ ఆర్య వైశ్య సంఘం నాయకుడు రాజశేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ అభివృద్ధికి కృషి

● ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మసూద్ స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అక్రమ కట్టడాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చెరువులు, బఫర్‌జోన్‌లలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రాతో కూల్చివేస్తూ అక్రమదారుల ఆటలు కట్టిస్తున్నారని అన్నారు.



హైదర్‌గూడలోని ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బండ ప్రకాష్ తదితరులు

కొర్వి కృష్ణస్వామి జీవితం స్ఫూర్తిదాయకం

● తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్

నల్లకుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జీవితం స్ఫూర్తిదాయకం అని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. సోమవారం కృష్ణస్వామి 131వ జయంతిని హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో నిర్వహించారు. కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక రాజకీయ ఉద్యమాలకు నాంది పలికి సమాజానికి కృష్ణస్వామి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మహాసభ అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలా రాములు, యువత రాష్ట్ర అధ్యక్షుడు బల్ల సత్తయ్య, ఉపాధ్యక్షులు యాదగిరి, రవికాంత్, కనకయ్య, నాయకులు బి. శ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ మహిళా సమాఖ్య నాయకులు స్వరూప రాణి, మల్లేశ్వరి తదితరులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

● తెలంగాణ మహిళా సమాఖ్య నాయకురాలు స్వరూపరాణి

ముషీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన వారిని ఉరి తీయాలని తెలంగాణ మహిళా సమాఖ్య నాయకురాలు స్వరూపరాణి డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముషీరాబాద్ నుంచి సుందరయ్య పార్కు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ మహిళలపై రోజు రోజుకు దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. వాటిని నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా సమాఖ్య సభ్యులు మల్లేశ్వరి, రామలక్ష్మి, రమ, లక్ష్మి, వాణిశ్రీ, రేణుకబాయి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ రాష్ట్ర సదస్సుకు మంత్రికి ఆహ్వానం

చిక్కడపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ రాష్ట్ర సదస్సుకు హాజరు కావాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ సంఘం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం పలికింది. ఈ మేరకు సంఘం కన్వీనర్ విజయ్‌కుమార్, సభ్యులు విజయ్, సైదులు, పి. విజయ్‌లు మంత్రిని సోమవారం కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. వచ్చేనెల 6న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ సదస్సు జరుగుతుందని విజయ్‌కుమార్ తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే టీచర్స్ లెక్చరర్స్ దేశంలో రాష్ట్రంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారి బాగోగులు పట్టించుకునే నాథుడే లేడన్నారు. ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ గొంతుకగా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ పనిచేస్తుందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యారంగానికి సేవ చేస్తూ ఎలాంటి గుర్తింపునకు నోచుకోని టీచర్స్, లెక్చరర్స్‌కు గుర్తింపు గౌరవం కావాలన్నారు. సదస్సుకు రాష్ట్రంలోని టీచర్స్ లెక్చరర్స్ అందరూ హాజరు కావాలని కమిటీ విజ్ఞప్తి చేస్తుందన్నారు.

టీఆర్‌టీకాలనీ గణేశ్ ఉత్సవ సమితి 61వ వార్షికోత్సవం

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌లోని టీఆర్‌టీ కాలనీ గణేశ్ ఉత్సవ సమితి 61వ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం రాత్రి గణేశ్ ఆగమన కార్యక్రమం నిర్వహించారు. ఆజామాబాద్‌లోని బైలాజికల్ ఈవెంట్ కంపెనీ చౌరస్తా నుంచి రాంనగర్ చౌరస్తా మీదుగా టీఆర్‌టీ కాలనీ వరకు తీసుకురాగ కాలనీవాసులు గణనాథుడికి పెద్దఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీఆర్‌టీ కాలనీ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ మక్సూద్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు నీలి రంగు గీతల షర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ఉంది. మృతుడిని గుర్తుపట్టిన వారు 9912221985 ఫోన్‌కు వివరాలు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



చిక్కడపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు



దోమలగూడలో ముషీరాబాద్ యాదవ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో యాదవ మహాసభ ప్రతినిధులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● చిన్నికృష్ణుని వేషధారణలో అలరించిన చిన్నారులు

బర్కత్‌పుర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యామ్‌బాబా మందిర్ ప్రాంగణంలో సోమవారం శ్రీకృష్ణ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్యామ్‌బాబా మందిరాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా భక్తి పాటలతో భజనలు చేశారు. కార్యక్రమంలో శ్యామ్‌బాబా మందిర్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రకాంత్ అగోటియా, కార్యదర్శి ఇంద్రకుమార్ ఆగర్వాల్, ఉపాధ్యక్షుడు రాందేవ్ ఆగర్వాల్ పాల్గొన్నారు.

పార్సీగుట్టలో అన్నదానం

ముషీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ పార్సీగుట్ట చౌరస్తాలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు.

శ్రీకృష్ణ తత్త్వాన్ని ఆచరించాలి

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వైవిధ్య భరితమైన శ్రీకృష్ణ తత్త్వాన్ని ఆచరించడం ద్వారా ప్రతి కుటుంబంలో సంతోషం అని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిక్కడపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీకృష్ణ తత్వమే భగవద్గీత సారం అని మానవ జీవితం, ధర్మం, ప్రేమ, సహనంతో ముడివడి ఉందన్నారు.

లక్ష్మీగణపతి దేవాలయంలో

చిక్కడపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఆర్టీసీ క్రాస్‌రోడ్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం అర్చకులు సోమవారం సన్మానించారు.

యాదవసేన ఆధ్వర్యంలో

తెలంగాణ యాదవసేన రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాదవసేన రాష్ట్ర అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, కమిటీ సభ్యులు కిషన్‌యాదవ్, శ్రీనివాస్, మల్లేష్, గుండెల్లి రవీందర్ తదితులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్ వద్ద భక్తుల రద్దీ



జవహర్‌నగర్‌లో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ యాదవసేన రాష్ట్ర కమిటీ సభ్యులు



మదర్స్ హైస్కూల్‌లో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



శ్యామ్‌బాబా మందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి



శ్యామ్‌బాబా మందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చంద్రకాంత్ అగోటియా, ఇంద్రకుమార్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్ తదితరులు



పార్సీగుట్టలో అన్నదానం చేస్తున్న ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు

హైడ్రాకు ప్రజలందరూ మద్దతివ్వాలి

● టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శి రవీంద్రనాథ్ నాయుడు

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జంట నగరాలలోని చెరువులు, నాలాలను పరిరక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రాకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్ నాయుడు కోరారు. హైడ్రా సంస్థ చేపడుతున్న అక్రమ కూల్చివేతలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంట నగరాలలోని ప్రజలకు గతం లో తాగునీటిని అందించిన చెరువులను పునరుద్ధరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమించిన వారిలో అధిక శాతం బీఆర్ఎస్ నేతలు ఉన్నందుకే వారు హైడ్రాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. సీఎం చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి హైడ్రాకు మద్దతుగా తాము నిలబడతామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శి రవీంద్రనాథ్ నాయుడు తదితరులు

సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డీ.హెచ్. ఉమేష్, సీవీ రఘునందన్‌రావు, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సుశీల్‌గాంధీ, సత్యనారాయణ పాల్గొన్నారు.



నల్లకుంటలోని బ్రాహ్మణ హాస్టల్ ప్రాంగణంలో మొక్కను నాటిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్. వేణుగోపాలరావు తదితరులు

ప్రతి ఒక్కరు ఇంటికి ఒక మొక్కను నాటాలి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు

నల్లకుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్. వేణుగోపాలరావు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినప్పుడే పర్యావరణం మనల్ని కాపాడుతుందన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ న్యూ నల్లకుంటలోని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ, బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బ్రాహ్మణ స్టూడెంట్ హోటల్ ప్రాంగణంలో వనమహోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పలు ఫ్యాక్టరీల నుంచి వెలువడే విషవాయువులు, వాహనాల నుంచి వెలువడే పొగతో నానాటికి పర్యావరణం కాలుష్యంగా మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ఇంటికి ఒక మొక్కను నాటాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో రెనోవా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ టీవీ నాగేష్, కె. సురేష్‌చందర్ రావు, బలవంత్‌రావు, సురేష్, హాస్టల్ ఇన్‌చార్జి ప్రకాష్‌రావు, శ్రీకాంత్, సీ.హెచ్. విశ్వేశ్వరరావు, మహేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. అజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా ఆశయాల సాధనకు కృషి చేయాలి

● మదర్ థెరిసా సేవా సంస్థ ప్రతినిధులు

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా ఆశయాల సాధన కోసం నేటి యువత కృషి చేయాలని మదర్ థెరిస్సా సేవా సంస్థ ప్రతినిధులు జి.స్వరూప, ఫిరంగి ప్రసాద్‌లు కోరారు. ఈ సందర్భంగా సంస్థ పక్షాన సోమవారం మదర్ థెరిస్సా విగ్రహానికి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జెటీనా లంక, చిట్టిబాబు, ఆంజనేయులు, మధు, సతీష్, హెన్సీబా తదితరులు పాల్గొన్నారు.

ఇనుప చువ్వల దొంగ అరెస్టు

బర్కత్‌పుర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇనుప చువ్వలను దొంగిలించిన దొంగను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ డివిజన్ పెట్రోల్ బంక్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు వరద నీటి కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కాంట్రాక్టర్ నిర్మాణం కోసం ఇనుప చువ్వలను తీసుకువచ్చాడు. ఏ సాయిబాబా (44) 20 కేజీల ఇనుప చువ్వలను సోమవారం సాయంత్రం ఎత్తుకెళ్లాడు. దీనిపై నిర్మాణ పనుల ఇంజనీర్ సతీష్ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ద్వారా సాయిబాబాను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు అతని వద్ద నుంచి దాదాపు రూ. 30 వేల రూపాయల విలువగల 20 కేజీల ఇనుప చువ్వలను స్వాధీనం చేసుకున్నట్లు అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి

● కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని శివస్థాన్‌పూర్‌లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని కార్పొరేటర్ రవిచారి అధికారులను హెచ్చరించారు. సోమవారం శివస్థాన్‌పూర్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించి ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ జలమండలి డీజీఎం మోహన్‌రావుకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికుల నరేష్, వనజ, శ్యామ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతుల అదృశ్యం

అంబర్‌పేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... జైస్వాల్ గార్డెన్లో నివాసముండే దయానంద్ కుమార్తె శ్రీలేఖ (24)ఇంటర్ వరకు చదివి ఇంట్లోనే ఉంటుంది. ఈనెల 25న ఉదయం ఏడు గంటల సమయంలో ఆమె ఇంట్లో వారికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు శ్రీలేఖ తండ్రి దయానంద్ సోమవారం అంబర్‌పేట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన రాంప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి శివం రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఆయన కుమార్తె హీనా మల్లం(21) ఈనెల 25న ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్లిపోయింది ఆమె కుటుంబ సభ్యులు అంబర్‌పేట్ ఫిర్యాదు చేయగా, ఎస్సై మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీలేఖ, హీన

యువకుడి అదృశ్యం

మూడుచింతలపల్లి, ఆగస్టు 26: యువకుడు అదృశ్యమైన సంఘటన శామీర్ పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... తూంకుంటకు చెందిన దూళ్ళ మోహన్‌కృష్ణ (20) తన బాబాయి అయిన దూళ్ళ శ్రీనివాసరావు వద్ద ఉంటూ మోర్ సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. కాగా, ఈ నెల 21న మధ్యాహ్నం ఒంటి గంటకు పని నిమిత్తం కొంపల్లిలోని విజేత సూపర్ మార్కెట్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో వెతికి చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అంబర్‌పేట స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న శివసేనారెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

● మాజీ ఎంపీ వి. హనుమంతరావు

అంబర్‌పేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో సోమవారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు శివసేనరెడ్డితో కలిసి వీహెచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఎన్నో పోరాటాలు చేసి మున్సిపల్ గ్రౌండ్ కాపాడుకున్నామని అన్నారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామని అన్నారు. స్విమ్మింగ్ పూల్‌ను మెరుగు పరిచి అంతర్జాతీయ పోటీలు జరిగే విధంగా తీర్చిదిద్దాలన్నారు. శివసేనరెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌కు అవసరమైన అన్ని సదుపాయాలుల కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పులి జగన్, నారాయణస్వామి, శ్రీధర్‌గౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అనిల్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి కన్వీనర్ వినయ్‌కుమార్, కో కన్వీనర్ మహేందర్‌బాబు తదితరులు

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కవాడిగూడ డివిజన్ కన్వీనర్‌గా అనిల్‌కుమార్

కవాడిగూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కవాడిగూడ డివిజన్ కన్వీనర్‌గా బి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, కో-కన్వీనర్ ఎం.సి. మహేందర్‌బాబు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగే విధంగా ఉత్సవ సమితి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం అనిల్‌కుమార్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు తదితరులు

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

● కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు పూర్తవుతున్న చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఎందుకు అమలుకు నోచుకోవడం లేదని, అంబేడ్కర్ అభయ హస్తం కోసం విధి విధానాలు రూపొందించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దళితుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల మెస్ చార్జీలు పెరిగిన ధరలకు సరిపోక హాస్టల్స్‌లో నాసిరకం భోజనం పెడుతున్నారని అన్నారు. సమావేశంలో కేవీపీఎస్ నేతలు కురుమయ్య, పాలడుగు నాగార్జున, మాణిక్యం, మనోహర్, లలిత, రామ్మూర్తి, శేఖర్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.